క్లుప్తంగా

కేశినేని నానికి ఆసిఫ్ శుభాకాంక్షలు



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విజయవాడ పార్లమెంట్ అభ్యర్థిగా నియమితులైన కేశినేని నానిని ఆ పార్టీ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి షేక్ ఆసిఫ్ గురువారం రాత్రి కలిశారు. కేశినేని కార్యాలయానికి వెళ్లిన ఆసిఫ్ ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. అలాగే ఆసిఫ్‌ను కేశినేని నాని ఆప్యాయంగా ఆహ్వానించి సత్కరించారు. పార్టీ విజయానికి కలిసికట్టుగా పని చేయాలని ఇద్దరు చర్చించుకున్నారు. అదే విధంగా మైనార్టీలు అధికంగా ఉన్న పశ్చిమ నియోజకవర్గంలో ఆ వర్గానికి చెందిన ఆసిఫ్‌ను నియమించటంపై కేశినేని నాని సముచితమైన నిర్ణయమని పేర్కొన్నారు. ఆసిఫ్ మాట్లాడుతూ తమ పార్టీ లోక్‌సభ అభ్యర్థిగా కేశినేని నానిని నియమించటంపై హర్షం వ్యక్తం చేశారు. రానున్న ఎన్నికల్లో విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గంలోని అన్ని సీట్లు విజయం సాధించేందుకు అందరూ కలిసికట్టుగా పని చేయాలని ఇద్దరూ పిలుపునిచ్చారు. ఆసిఫ్‌తో పాటుగా కార్పొరేటర్ యలకల చలపతిరావు, నాయకులు రాజా రమేష్ తదితరులు ఉన్నారు.

భారత అంధుల క్రికెట్ జట్టు కెప్టెన్ అజయ్‌కుమార్‌రెడ్డికి సత్కారం

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): అర్జున అవార్డు గ్రహీత, భారత అంధుల క్రికెట్ జట్టు కెప్టెన్ ఇల్లూరి అజయ్‌కుమార్‌రెడ్డిని కోస్టల్ బ్యాంక్ మేనేజింగ్ డైరెక్టర్ బి.వేణుగోపాల్‌రెడ్డి విజయవాడ గాయత్రీనగర్‌లోని ప్రధాన కార్యాలయంలో గురువారం సత్కరించారు. అజయ్‌కుమార్‌రెడ్డి క్రికెట్‌లో రాణించేందుకు బ్యాంకు తరపున సహకారం అందిస్తామని వేణుగోపాల్‌రెడ్డి చెప్పారు. 2018 సంవత్సరంలో అజయ్‌కుమార్ రెడ్డి కెప్టెన్ ఉన్న సమయంలో భారత్‌కు ప్రపంచ కప్ సాధించిందన్నారు. అజయ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ అర్జున అవార్డు తీసుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. బ్యాంకు చీఫ్ జనరల్ మేనేజర్ కేవీ రామన్, బ్యాంక్ చీఫ్ క్రెడిట్ ఆఫీసర్ వై.సత్యనారాయణ, బ్యాంక్ చీఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఆఫీసర్ సురేష్‌కుమార్ అగ్రవాలాతో పాటుగా బ్యాంకు ఉద్యోగులు అజయ్‌కుమార్‌రెడ్డిని సత్కరించారు.

ఉత్సాహంగా ఫేర్‌వెల్ వేడుకలు



భవానీపురం(విజయవాడపశ్చిమ): ఎన్టీఆర్ జిల్లా గొల్లపూడిలోని శ్రీశాస్త్ర జూనియర్ కళాశాల ఫేర్‌వెల్ వేడుకలు ఉత్సాహభరిత వాతావరణంలో ఘనంగా జరిగాయి. భవానీపురంలోని ఒక ఫంక్షన్ హాల్లో గురువారం నిర్వహించిన వేడుకల్లో విద్యార్థులు ప్రదర్శించిన డ్యాన్స్‌లు ఆకట్టుకున్నాయి. వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరైన కళాశాల డైరెక్టర్ ఎస్.సుధీర్ మాట్లాడుతూ కాలేజి స్థాపించిన నాటి నుంచి అత్యున్నత ఫలితాలను సాధిస్తుందని చెప్పారు. కార్పొరేట్ స్థాయిలో విద్యను అందిస్తూ విద్యార్థులను అన్ని రంగాల్లో రాణించేలా తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. ఈ విద్యా సంవత్సరం నుంచి ఎంసెట్, జేఈఈ మెయిన్స్‌కు కోచింగ్ అందిస్తున్నామని చెప్పారు. ఈ అవకాశాన్ని ఇతర కళాశాలల విద్యార్థులు కూడా సద్వినియోగం చేసుకోవచ్చని పేర్కొన్నారు. ప్రిన్సిపాల్ పి. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో రాణించేలా అన్ని రకాల పోటీ పరీక్షలకు శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. కళాశాల ఇన్‌చార్జ్ ప్రవీణ్, అధ్యాపకులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మహిళపై కత్తితో దాడి

పాయకాపురం(విజయవాడరూరల్): నున్న పోలీసు స్టేషన్ పరిధి ఏపీఎస్ రెడ్డి రోడ్డులో లక్ష్మీగణపతి కన్‌స్ట్రక్షన్‌లో అద్దెకుంటున్న రిటైర్డు పాలిటెక్నిక్ కాలేజి లెక్చరర్ డీవీఎస్ పోతురాజు అనే మతి స్థిమితం లేని వ్యక్తి ఇంటి యజమాని చెల్లెలు కరణం సింహాచలం అనే మహిళ పై గురువారం కత్తితో దాడి చేశాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.... పోతురాజు తల్లి రెండు నెలల క్రితం చనిపోయింది. అప్పటి నుంచి మతిస్థిమితం కోల్పోయి వింతగా ప్రవర్తిస్తుంటాడు. ఈ నేపథ్యంలో ఇంటి యజమాని చెల్లి సింహాచలంపై కత్తితో దాడి చేయడంతో పాటు ఇంటికి నిప్పుపెట్టాడు. అడ్డు వచ్చిన లేడీ టైలర్ సునీతకు స్వల్ప గాయమైంది. చుట్టుపక్కల వారు వచ్చి పోతురాజును అడ్డుకున్నారు. ఈ ఘటనలో పోతురాజుకు స్వల్ప గాయాలయ్యాయి. లేడీస్ టైలర్ సునీతను, సింహాచలంను బంధువులు చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న ఎస్ఐ గోవిందు సిబ్బందితో ఘటన ప్రదేశానికి వెళ్లి పోతురాజును అదుపులోకి తీసుకొని ప్రాథమిక చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తీసుకెళ్లారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఉత్సాహంగా సంక్రాంతి సంబరాలు



పీబీ సిద్ధార్థ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో భోగి మంటల వద్ద విద్యార్థినులు, అధ్యాపకుల సందడి



సంక్రాంతి ముగ్గులు వేస్తున్న దృశ్యం

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): బొమ్మల కొలువులు, భోగి మంటలు, గొబ్బిమ్మలు, గాలిపటాలు, రంగవల్లులతో పీబీ సిద్ధార్థ కళాశాల మైదానం సందడిగా మారింది. సిద్ధార్థ కళాశాల గుడ్ హ్యాబిట్స్ క్లబ్, ఉమెన్స్ క్లబ్, మహిళా సాధికారతా విభాగం ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలను కళాశాల ఆవరణలో గురువారం నిర్వహించారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. తెలుగు అమ్మాయి, తెలుగు అబ్బాయి పేరుతో నిర్వహించిన పోటీల్లో సాంప్రదాయ దుస్తుల్లో యువతీ యువకులు పాల్గొన్నారు. భోగి మంటలు వేసి చుట్టూ తిరుగుతూ నృత్యాలు చేశారు. కళాశాల డైరెక్టర్ వేమూరి బాబూరావు, కళాశాల ప్రిన్సిపాల్ ఎం.రమేష్, కళాశాల డీన్ రాజేష్‌తో పాటుగా అధ్యాపకులు సంక్రాంతి సంబరాల్లో పాల్గొన్నారు.

ఫార్మసీ కళాశాలలో....

లబ్బీపేట(విజయవాడతూర్పు): పిన్నమనేని పాలిక్లినిక్ రోడ్డులోని సిద్ధార్థ ఫార్మసీ కళాశాలలో గురువారం సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. అందులో భాగంగా విద్యార్థినులు రంగు రంగుల రంగవల్లులు వేశారు. గంగిరెద్దుల విన్యాసాలు, భోగి మంటలు, బొమ్మల కొలువు, కోలాటం, భోగిపళ్లు, గాలిపటాలు, నృత్యరూపకాలు, ఆటల పోటీలు, రకరకాల పిండి వంటలు వంటి కార్యక్రమాల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. సిద్ధార్థ అకాడమీ కార్యదర్శి పాలడుగు లక్ష్మణరావు, కళాశాల కన్వీనర్ చుక్కపల్లి అరుణ్‌కుమార్, ప్రిన్సిపాల్ ఎ.సునీత, కల్చరల్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



బొమ్మల కొలువుల వద్ద విద్యార్థులు



రంగవల్లులు తీర్చిదిద్దుతున్న విద్యార్థినులు

వీఎంసీలో ప్రత్యేక కమిటీలు ఏర్పాటు



నూతనంగా ఏర్పాటైన ప్రత్యేక కమిటీలను అభినందిస్తున్న వెంకటసత్యం, వసంతలక్ష్మి

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగర పాలక సంస్థ వైఎస్సార్ సీపీ ఫ్లోర్ లీడర్ వెంకటసత్యం, వీఎంసీ కార్యదర్శి వసంత లక్ష్మి సంయుక్త ఆధ్వర్యంలో కమిటీ సభ్యులందరూ గురువారం సమావేశమయ్యారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్‌హాలులోని ఫ్లోర్ లీడర్ చాంబర్లో నిర్వహించిన సమావేశంలో గురువారం ఆరు ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేశారు. నూతనంగా ఆరు ప్రత్యేక కమిటీలకు కార్పొరేటర్లను ఎన్నుకున్నారు. మంచినీటి సరఫరా భూగర్భ నీటిపారుదల ప్రత్యేక కమిటీ చైర్మన్‌గా 54వ డివిజన్ కార్పొరేటర్ అబ్దుల్ అకీబ్ అర్షద్, డెప్యూటీ చైర్మన్ వియ్యపు అమర్నాథ్ ఆరవ డివిజన్ కార్పొరేటర్ ఎన్నికయ్యారు. క్రీడలు, ట్రాఫిక్ ప్రత్యేక కమిటీకి చైర్‌పర్సన్‌గా 21 డివిజన్ కార్పొరేటర్ పుప్పాల నరసకుమారి డెప్యూటీ చైర్ పర్సన్ 61 డివిజన్ కార్పొరేటర్ ఉమ్మడి రమాదేవి ఎన్నికయ్యారు. రోడ్లు, డ్రెయిన్లు వంతెనలు భవనముల నిర్మాణం ప్రత్యేక కమిటీకి చైర్మన్‌గా 40వ డివిజన్ కార్పొరేటర్ వై. ఆంజనేయ రెడ్డి, డెప్యూటీ చైర్మన్‌గా 5వ డివిజన్ కార్పొరేటర్ కలపాల అంబేద్కర్ ఎన్నికయ్యారు. లైటింగ్ పార్కుల అభివృద్ధి ప్రత్యేక కమిటీ చైర్‌పర్సన్ 62వ డివిజన్ కార్పొరేటర్ అలంపురం విజయలక్ష్మి, డెప్యూటీ చైర్మన్‌గా 49వ డివిజన్ కార్పొరేటర్ బుల్లా విజయ్ కుమార్ ఎన్నికయ్యారు. ప్రజా ఫిర్యాదుల ప్రత్యేక కమిటీ చైర్ పర్సన్‌గా 27వ డివిజన్ కార్పొరేటర్ కొండాయగుంట మల్లీశ్వరి, డెప్యూటీ చైర్మన్ 43వ డివిజన్ కార్పొరేటర్ కోటిరెడ్డి ఎన్నికయ్యారు. మురికివాడల అభివృద్ధి ప్రత్యేక కమిటీ చైర్పర్సన్‌గా ఒకటవ డివిజన్ కార్పొరేటర్ ఉద్దంటి సునీత, డెప్యూటీ చైర్మన్ 39వ డివిజన్ కార్పొరేటర్ గుడివాడ నరేంద్ర రాఘవ ఎన్నికయ్యారు.

వైభవంగా కూడరైవల్లి మహోత్సవం



స్వామి వారికి నివేదన చేస్తున్న అర్చకులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): కోదండరామ స్వామి దేవస్థానం (కొత్తగుళ్లు) ప్రాంగణంలో కూడరైవల్లి ఉత్సవాన్ని గురువారం వైభవంగా నిర్వహించారు. ధనుర్మాసాన్ని పురస్కరించుకొని స్వామి సన్నిధిలో ఈ ఉత్సవాన్ని శాస్త్రోక్తంగా చేశారు. ధనుర్మాసంలో గోదాదేవి విరచితమైన తిరుప్పావై పాశురాలను ప్రతి రోజూ గానం చేసి స్వామి వారిని అర్చిస్తారు. గురువారం కూడరై పాశురాన్ని గానం చేయడం, కూడరైవల్లి ఉత్సవాన్ని నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. అందులో భాగంగా ఆండాళ్ సమేతంగా వేంచేసి ఉన్న వేణుగోపాలుని మూర్తులకు 108 చిన్ని గంగాళాల్లో ప్రసాద నివేదన చేసి పూజలు చేశారు. ఈ సందర్భంగా స్వామి వారి మూలమూర్తికి, ఉత్సవమూర్తులకు ప్రత్యేక వైదిక కార్యక్రమాలు నిర్వహించారు. అదేవిధంగా సాయంత్రం అండాళ్ అమ్మవారికి తిరుమంజన కైంకర్యాన్ని నిర్వహించారు. అనంతరం స్వామి వారిని, అమ్మవార్ల ఉత్సవమూర్తులనే నేత్రపర్వంగా అలంకరించారు. రాత్రి స్వామి వారికి, అమ్మవార్లకు ఎదుర్కోల ఉత్సవాన్ని సందడిగా చేశారు. ఈ సందర్భంగా ఉత్సవమూర్తులను ఎదురెదురుగా ఉంచి స్వామివారి, అమ్మవారి గుణగణాలను కీర్తిస్తూ వారి వివాహ సంబంధాన్ని ఖాయం చేసిన ఘట్టాన్ని నిర్వహించారు. కార్యక్రమాలను పులిపాక రాఘవాచార్యులు, ఆంజనేయాచార్యులు తదితరులు నిర్వహించారు.

రాజకీయాలకు అతీతంగా ముదిరాజ్ సమాజ నిర్మాణం

ఏపీ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు కొర్న నారాయణ



ముదిరాజ్ సంఘీయులతో కొర్న నారాయణ, ఏడుకొండలు, క్రేన్ శివాజి తదితరులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): రాజకీయాలకు అతీతంగా సమర్థవంతమైన ముదిరాజ్ సమాజాన్ని నిర్మించటమే ఈ ముదిరాజ్ జనచైతన్య యాత్రల ముఖ్య ఉద్దేశమని ఏపీ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు, ఏపీ ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ కొర్న నారాయణ తెలిపారు. రాష్ట్రంలోని ముదిరాజులను చైతన్య పరచే దిశగా వివిధ ప్రాంతాల్లో రేపటి తరం కోసం నేటి తరం ప్రయత్నం పేరుతో జరుగుతున్న ముదిరాజ్ జన చైతన్య రథ యాత్రలో భాగంగా గురువారం సాయంత్రం ఎన్టీఆర్ జిల్లా గొల్లపూడిలో నిర్వహించిన రథయాత్రలో ఆయన మాట్లాడారు. జనాభా ధామాషా ప్రకారం రాజకీయాల్లో మన వాటాను కోరుకోవడం ప్రజాస్వామ్య దేశంలో రాజ్యాంగం కల్పించిన హక్కని తెలిపారు. ముదిరాజ్ మహాసభలో నాయకులు, కార్యకర్తలు వేరు కాదని, మేధావులు, ఉద్యమకారులు, కళాకారులు సమష్టిగా పని చేస్తున్నారని చెప్పారు. ఈ ముదిరాజ్ మహాసభ ఏక వ్యక్తి నాయకత్వం కింద నడిచే సంస్థ కాదని స్పష్టం చేశారు. ఇప్పటి వరకు బీసీ–డీలో ఉన్న ముదిరాజులను బీసీ–ఎ కేటగిరిలోకి మార్చాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అప్పుడే ముదిరాజ్ సంఘీయులకు అనేక ప్రయోజనాలు ఒనకూరతాయని తెలిపారు. ముదిరాజ్ మహాసభ యూత్ ప్రసిడెంట్ కోలా ఏడుకొండలు మాట్లాడుతూ రేపటి తరం కోసం నేటి ప్రయత్నం పేరుతో ఊరూరా తిరుగుతూ సాగుతున్న ముదిరాజ్ జనచైతన్య రథయాత్రలో మన సంఘీయులందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు దుప్పల శివాజి (క్రేన్ శివాజి) మాట్లాడుతూ ముదిరాజ్‌లకు రాజ్యాధికారం కావాలని, ఆ దిశగా ముదిరాజ్ సమాజాన్ని చైతన్యపరచాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. కళాకారుడు బుల్లెట్ వెంకన్న నేతృత్వంలో వరంగల్‌కు చెందిన ముదిరాజ్ కళామండలి కళాకారులు డప్పు నరసింహం, వై. చంద్రకళ, కె.హారిక, టి.కల్యాణి ఆలపించిన చైతన్య గీతాలు అందరినీ ఆలోచింప చేశాయి. ముదిరాజ్ నాయకులు కంటు మహేష్, నామాల సుధాకర్, మేకల సుధాకర్, ఈర్ల నారాయణ, గోసేపల్లి రాజు, చెరుకుమల్లి నరేంద్ర, పుల్లారావు, మహిళా నాయకులు ఝాన్సీ, లలిత తదితరులు పాల్గొన్నారు.

కృష్ణా వర్సిటీ మహిళా హ్యాండ్‌బాల్ చాంపియన్ కేబీఎన్



విజయం సాధించిన విద్యార్థులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): కృష్ణా విశ్వవిద్యాలయం అంతర్ కళాశాలల మహిళా హ్యాండ్ బాల్ పోటీల్లో కేబీఎన్ కళాశాల విద్యార్థినులు చాంపియన్‌షిప్‌ను సాధించారని ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.నారాయణరావు తెలిపారు. విశ్వ విద్యాలయ అంతర్ కలాశాలల హ్యాండ్ బాల్ మహిళా పోటీలు ఇటీవల మైలవరంలోని డాక్టర్ ఎల్ హెచ్ ఆర్ గవర్నమెంట్ డిగ్రీ కళాశాలలో జరిగినట్లు పేర్కొన్నారు. అందులో భాగంగా తమ విద్యార్థినుల బృందం గతంలో సాధించిన విధంగానే ఈ ఏడాది సైతం విజయం సాధించి చాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకున్నట్లు తెలిపారు. తమిళనాడు సేలంలో జరిగే దక్షిణ భారత అంతర్ విశ్వవిద్యాలయ మహిళా హ్యాండ్ బాల్ పోటీలకు కృష్ణా విశ్వవిద్యాలయం పక్షాన హాజరయ్యేందుకు ఏడుగురు విద్యార్థినులు ఎంపికైనట్లు పేర్కొన్నారు. అందులో ఎ.రాగ మౌనిక, పి.శివాని, జి. లలితా శ్రీ, జి.మానస, ఎస్.వెంకటేశ్వరమ్మ, బి.జెస్సీ, బి. లోకేశ్వరి ఉన్నారు. విజేతలను, వారిని కళాశాల వ్యాయామ విభాగాధిపతి డి.హేమచంద్రరావుని కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ టి.శ్రీనివాసు అభినందించినట్లు పేర్కొన్నారు. వైస్ ప్రిన్సిపాల్ పీఎల్ రమేష్, డాక్టర్ ఎం.వెంకటేశ్వరరావు తదితరులు ఉన్నారు.

అంబేడ్కర్ విగ్రహావిష్కరణ విజయవంతం చేయండి

నూర్ బాషా కార్పొరేషన్ చైర్మన్ రసూల్



మాట్లాడుతున్న నూర్ బాషా కార్పొరేషన్ చైర్మన్ ఓ రసూల్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): విజయవాడ నడిబొడ్డులో నిర్మించిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 125 అడుగుల విగ్రహం, స్మృతివనం ప్రారంభోత్సవానికి రాష్ట్రంలోని నూర్ బాషా సంఘీయులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని నూర్ బాషా కార్పొరేషన్ చైర్మన్ ఓ.రసూల్ పిలుపునిచ్చారు. గురువారం గవర్నర్‌పేటలోని ఓ హోటల్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 19వ తేదీన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా జరిగే స్మృతివనం, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. దేశ చరిత్రలోనే ఒక అద్భుతమైన ఘట్టం ఆవిష్కృతం కాబోతోందన్నారు. సీఎం వైఎస్ జగన్ రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా పాలన సాగిస్తున్నారని చెప్పారు. అట్టడుగు వర్గాలకు సామాజిక న్యాయం అందించేందుకు జగన్ ప్రభుత్వం కృషి చేస్తుందని పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు సముచిత స్థానం కల్పించారన్నారు. దేశంలోనే మొట్టమొదటిసారిగా 139 కులాలకు కార్పొరేషన్లు ఏర్పాటు చేసిన ఘనత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిదేనన్నారు. సామాజిక న్యాయం జగనన్నతోనే సాధ్యమని పేర్కొన్నారు. వచ్చే ఎన్నికల్లో 175 స్థానాల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించడం ద్వారా ప్రజా ప్రభుత్వాన్ని ఏర్పాటుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో నూర్ బాషా సంక్షేమ సంఘం అధికార ప్రతినిధి షేక్ సయ్యద్ బాజీ, ఉపాధ్యక్షులు పులిమద్ది చిన మస్తాన్, నూర్‌బాషా, ముస్లిం సంక్షేమ సంఘం అధ్యక్షుడు చిన్నా తదితరులు పాల్గొన్నారు.

రామాలయ నిర్మాణం చారిత్రక ఘట్టం



ర్యాలీ చేస్తున్న బీజేపీ నాయకులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): అయోధ్యలో రామాలయం నిర్మాణం ఒక గొప్ప చారిత్రక ఘట్టమని బీజేపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు అడ్డూరి శ్రీరామ్ అన్నారు. ఆ పార్టీ మైనార్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ బాజీ, జిల్లా అధ్యక్షుడు హేమంత్ జైన్ ఆధ్వర్యంలో అయోధ్య రామాలయం నిర్మాణాన్ని పురస్కరించుకొని స్వామివారి అక్షింతల పంపిణీ నగరంలోని వివిధ ప్రాంతాల్లో గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీరామ్ మాట్లాడుతూ అయోధ్యలో జన్మించిన శ్రీరామచంద్రమూర్తికి ఆలయాన్ని నిర్మించే ధైర్యం గత ఏ ప్రభుత్వాలు చేయలేదన్నారు. భారతీయుల చిరకాల వాంఛ అయోధ్య రామాలయ నిర్మాణం అన్నారు. గత పాలకులు దానిని నిర్లక్ష్యం చేశారన్నారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన తరువాత కోట్లాది భారతీయుల కలను నిజం చేసిందన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నాయకత్వంలో నిర్మాణం అద్వితీయంగా జరిగిందన్నారు. ఈనెల 22వ తేదీన జరగనున్న రామాలయ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాన్ని యావత్ ప్రపంచం గొప్ప పండుగగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. పార్టీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు హేమంత్ జైన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. పార్టీ మైనార్టీ సెల్ జిల్లా నాయకులు వరప్రసాద్, ప్రవీణ్ రాంకా, అరవింద్ జైన్, నరేష్ జైన్, గౌతమ్ జైన్, మనీష్ జైన్, కమలేష్ జైన్, మహేంద్ర జైన్, పన్నాలాల్ జైన్, బవర్లాల్ జైన్, దినేష్ జైన్, ప్రవీణ్ జైన్, అశోక్ చైన్, అశోక్ జైన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ప్రతిభావంతులుగా ఎదగాలి

గుణదల (విజయవాడ తూర్పు): విద్యార్థులు తమలో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసి ప్రతిభావంతులుగా ఎదగాలని రాష్ట్ర గ్రంథాలయ సంఘం కార్యదర్శి రవి శారద అన్నారు. ఆంధ్ర లయోల కళాశాలలో స్ఫూర్తి–2024 కార్యక్రమం గురువారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆమె మాట్లడుతూ విద్యార్థులు సమయాన్ని సద్వినియోగం చేసుకుని చక్కగా చదువుకోవాలని కోరారు. మంచి ఫలితాలు సాధించి ఉన్నత వ్యక్తిత్వంతో ముందుకు సాగాలని సూచించారు. ప్రతిభకు సానపెట్టి మంచి గుర్తింపు సాధించాలని కోరారు. లలిత కళలు, క్రీడలు, వంటి రంగాల్లో నైపుణ్యాన్ని పెంచుకోవాలని పేర్కొన్నారు.

ఓబన్న కృషి చిరస్మరణీయం



ఓబన్న చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న రేవతి, దేరంగుల రమణారావు తదితరులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): గొల్లపూడిలోని బీసీ సంక్షేమ భవన్‌లోగల వడ్డెర కార్పొరేషన్ కార్యాలయంలో గురువారం సాయంత్రం స్వాతంత్ర్య సమర యోధుడు వడ్డె ఓబన్న జయంతి ఘనంగా నిర్వహించారు. వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ దేరంగుల రమణారావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా వడ్డెర కార్పొరేషన్ చైర్‌పర్సన్ దేవల్ల రేవతి హాజరయ్యారు. ఓబన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వడ్డెర జాతి అభ్యున్నతి కోసం ఓబన్న చేసిన కృషి చిరస్మరణీయమని పేర్కొన్నారు. అటువంటి మహనీయుల జీవిత చరిత్రలను స్ఫూర్తిగా తీసుకుని నేటి వడ్డెర యువత ముందుకు సాగాలని కోరారు. వడ్డెర కార్పొరేషన్ ఏర్పాటు చేయటమే కాకుండా దానికి చైర్మన్, డైరెక్టర్లను నియమించి వడ్డెర జాతికి అందిస్తున్న సంక్షేమ పథకాల సారథి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించుకుంటామని చెప్పారు. వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ దేరంగుల వెంకట రమణారావు మాట్లాడుతూ వెనుకబడిన కులాలను గుర్తించి వారికి సముచిత స్థానం కల్పించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చరిత్రలో నిలిచిపోతారని తెలిపారు. ముఖ్యంగా వడ్డెర సామాజికవర్గ ప్రజల అభ్యున్నతి కోసం సీఎం జగనన్న చేస్తున్న కృషి మరువలేమన్నారు. ఆయన స్ఫూర్తితోనే వడ్డెర సామాజికవర్గానికి సేవలు అందిస్తామని తెలిపారు.

రైల్వే డీఆర్‌ఎంతో ఎమ్మెల్యే మల్లాది విష్ణు భేటీ



డీఆర్‌ఎంతో భేటీ అయిన ఎమ్మెల్యే విష్ణు

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): సెంట్రల్ నియోజకవర్గంలో జరుగుతున్న పలు రైల్వే ప్రాజెక్టులపై ఎమ్మెల్యే, రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు మల్లాది విష్ణు విజయవాడ రైల్వే డీఆర్‌ఎం నరేంద్ర ఏ పాటిల్‌తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో జరుగుతున్న పలు రైల్వే పనులపై డీఆర్‌ఎంతో చర్చించారు. ముఖ్యంగా శ్రీనగర్ కాలనీలో రైల్వే శాఖ కట్టిన గోడల వల్ల కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నట్లు డీఆర్‌ఎం దృష్టికి తీసుకెళ్లారు. ఫలితంగా విద్యార్థులు, ఉద్యోగులు, అత్యవసరంగా బయటకు వెళ్లే వారు బీఆర్టీఎస్ రోడ్డుకు చుట్టూ తిరిగి వెళ్లాల్సి వస్తుందని తెలిపారు. శ్రీనగర్, సత్యనారాయణపురం రైల్వేకాలనీని కలిపే రహదారిని పునరుద్ధరించాలని కోరారు. దీనిపై తానే స్వయంగా పరిశీలించి నిర్ణయం తీసుకుంటామని డీఆర్‌ఎం తెలియజేశారు. అనంతరం నియోజకవర్గంలో పలు పెండింగ్ పనులపై చర్చించారు. గుణదల, వాంబే కాలనీలలో గతి శక్తి ప్రాజెక్టు కింద చేపట్టాల్సి ఉన్న రైల్వే ఓవర్ బ్రిడ్జి(ఆర్‌ఓబి)ల నిర్మాణాలకు సంబంధించి అనుమతులు త్వరితగతిన వెలువడేలా చొరవ చూపాలని కోరగా డీఆర్‌ఎం సానుకూలంగా స్పందించినట్లు మల్లాది విష్ణు తెలిపారు. ఈ సమీక్షలో నగరపాలక సంస్థ ఈఈ వి.శ్రీనివాస్, రైల్వే అధికారులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

భవానీపురం(విజయవాడపశ్చిమ): విద్యాధరపురం చెరువు సెంటర్‌లోని మర్రిచెట్టు 156వ వార్డ్ సచివాలయం పరిధిలో నివసిస్తున్న వాడపల్లి నారాయణమ్మ గురువారం మరణించింది. ఆమె పేరు వైఎస్సార్ బీమా పథకం కింద నమోదయ్యి ఉండటంతో లక్ష రూపాయలు మంజూరయింది. ఈ సందర్భంగా మృతురాలి అంత్యక్రియల్లో భాగంగా మట్టి ఖర్చుల కోసం తక్షణ సాయంగా రూ.10వేల నగదును 44వ డివిజన్ కార్పొరేటర్ మైలవరపు రత్నకుమారి గురువారం మృతురాలి కుటుంబసభ్యురాలు మధు కుమారికి అందచేశారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మైలవరపు దుర్గారావు, 156వ సచివాలయం వెల్ఫేర్ సెక్రటరీ రాధాకృష్ణ, వలంటీర్ శ్రావణి పాల్గొన్నారు.

ప్రకటన

మా క్లయింట్లన్నా కృష్ణా జిల్లా, విజయవాడ, ఇస్లాంపేట, హద్దు సాహెబ్ వీధి, డోరు నెం. 11-4-74, కాపురస్తులు మస్తాన్ ఖాన్ గారి కుమారుడు యూసఫ్ ఖాన్ గారి ఉత్తర్వులు పొంది యావన్మందికి తెలియజేయునది ఏమనగా..

దిగువ షెడ్యూలు దాఖలా స్థిరాస్తి (1) పచ్చల విక్టర్ ప్రభాకర్ S/o. పచ్చల వెంకయ్య, నివాసం: కృష్ణాజిల్లా, విజయవాడ, ఇస్లాంపేట, అబ్దుల్ ఖాదర్ వీధి, డోరు నెం. 12-13-30, (2) బండి విజయ కుమారి W/o. బండి బాబురావు, నివాసం: కృష్ణాజిల్లా, విజయవాడ, పటమట, ఫ్లాట్ నెం. 166, 4వ లైన్, న్యూ పోస్టల్ కాలనీ, డోరు నెం. 57-10-10, (3) పచ్చల మేరీ వసంత కుమారి W/o. జక్కుల విజయరాజు, నివాసం: కృష్ణాజిల్లా, విజయవాడ, ఆటోనగర్, పటమట, ఫ్లాట్ నెం.134, ఎలక్ట్రిసిటీ కాలనీ, డోరు నెం. 74-14-208, (4) ఎద్దు యాని కళ్యాణి, W/o. లేట్ వై. క్రిస్టాదారి, (5) పచ్చల కమల్ సందీప్ S/o. డాక్టర్ పచ్చల జాన్ రాబర్ట్ మోహనరావు, (6) పీమా పచ్చల D/o. డాక్టర్ పచ్చల జాన్ రాబర్ట్ మోహనరావు, 4,5,6 వారల తరుపున జనరల్ పవర్ ఆఫ్ అటార్నీ హోల్డర్ ఒకటవ వారైన పచ్చల విక్టర్ ప్రభాకర్, S/o. పచ్చల వెంకయ్య, నివాసం: కృష్ణాజిల్లా, విజయవాడ, ఇస్లాంపేట, అబ్దుల్ ఖాదర్ వీధి, డోరు నెం. 12-13-30 వార్ల వద్ద నుండి నా క్లయింట్ క్రయం పొందుటకు క్రయ ఖరారు పడి విక్రయ అగ్రిమెంటు ది. 09-01-2024న పొందియున్నారు. కావున మా క్లయింటు షెడ్యూల్ దాఖల స్థిరాస్తిని క్రయం పొందుటలో ఎవరికైనను ఏవిధమైన చెల్లదగిన విక్రయ ఎగ్రిమెంటు, జప్తు, ఇంజక్షన్, మనోవర్తి, జాయింటు భాగలబ్ధ తగాయిదా, వగైర క్లయిములు ఉన్ననూ షెడ్యూల్ ఆస్తి క్రయము గురించి ఎవరికైన ఎటువంటి ఆక్షేపణలు ఉన్ననూ సదరు క్లయిములను ఆక్షేపణలను ఈ ప్రకటన వెలువడిన 7 రోజులలోగా తగిన ఆధారములతో అభ్యంతరములను వ్రాత పూర్వకముగా రిజిష్టరు పోస్టు ద్వారా మాకు తెలియబరచవలెను. లేని యెడల షెడ్యూలు దాఖలా స్థిరాస్తి నిర్వివాదమైన స్థిరాస్తిగా భావించి క్రయ దస్తావేజును రిజిష్టర్ పొందగలరు. గడువు తేదీ పిమ్మట వచ్చు అభ్యంతరములు మా క్లయింటును బైండు చేయజాలవు.

క్రయాస్తి షెడ్యూలు: కృష్ణాజిల్లా, విజయవాడ రిజిస్ట్రేషన్ జిల్లా రిజిస్ట్రారు వారి యిలాకా, విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ ఏరియాలో చేరిన, విజయవాడ టౌన్ అబ్దుల్ ఖాదర్ వీధి మరియు గంగానమ్మ గుడి ఎదురు వీధిలో (బి.ఆర్.పి. రోడ్డు) యున్నటువంటిన్ని రెవిన్యూ వార్డు నెం. 40 అసెస్మెంటు నెం. 1073027495, డోరు నెం. 12-13-30రు దాఖలా ఆస్తికి **హద్దులు: తూర్పు:** బొమ్మల చుక్కమ్మ తాలూకు ఇంటి స్థలం, ప్రస్తుతం జాయింటు దారి హద్దు; **దక్షిణం:** ఇర్రిపోతుల రాజు గారి ఆస్తి, రాజు మీనాక్షి నిలయం; **పడమర:** జేడి శామ్యూల్ గారి స్థలం, యూసుఫ్ ఖాన్ మరియు ఫాతిమా బి గారి ఆస్తి; **ఉత్తరం:** రెండు అడుగుల జాయింటు దారి హద్దు, పట్టపు సాయి శంకర్ గారి ఆస్తి.

ఈ నాలుగు హద్దులే మధ్య చ.గ.॥ 72-0లు స్థిరాస్తి నివేశన స్థలమున్నూ, సదరు స్థలములో గ్రౌండ్ మరియు ఫస్ట్ ఫ్లోరుగా గల ఆర్.సి.సి. బిల్డింగు మరియు జాయింటు నడక దారితో సహాయున్నూ.

ఇట్లు: **పిళ్ళా రవి, పిళ్ళా సురేఖ,** న్యాయవాదులు, సామారంగ చౌక్, విజయవాడ-520 001. ✆ 98481 10109